క్లుప్తంగా

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

గిద్దలూరు రూరల్: తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.రాంభూపాల్‌రెడ్డి సూచించారు. డాక్ చౌక్‌పాల్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెద్ద పోస్టాఫీసులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం తపాలా శాఖ అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బ్యాంకులకు దీటుగా పోస్టల్ శాఖ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు సర్కిల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, గిద్దలూరు పోస్టాఫీసు ఇన్‌చార్జి అల్లం రవి, పోస్టల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

కంటి చూపుపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గిద్దలూరు రూరల్: కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.నాగభూషణ్‌రెడ్డి సూచించారు. బుధవారం విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని శిబిరం నిర్వాహకుడు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయుడు ఖాన్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హ్యూమన్ కేర్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సెక్రటరీగా జాషువా



నియామక పత్రం అందుకుంటున్న జాషువా

గిద్దలూరు రూరల్: హ్యూమన్ కేర్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా సెక్రటరీగా గిద్దలూరు పట్టణానికి చెందిన గుమ్మా జాషువా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జోసఫ్ ఉమెన్స్ వింగ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అమాలోపావార్‌రాణి ఇటీవల ఒంగోలులో నిర్వహించిన ప్రజాస్వామ్య అంతార్జాతీయ దినోత్సవం కార్యక్రమంలో తనను ఏకగ్రీవంగా నియమించారని జాషువా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మానవ హక్కులకు భంగం కలిగినా, న్యాయపరమైన సహాయం అందించేందుకు తమను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం తర్లుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు కోటిమోహన్, ఏఎన్‌ఎంలు హెబ్సీబా, సుమ, మల్లీశ్వరీ, స్రవంతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చప్టాకు తాత్కాలిక మరమ్మతులు



తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న గంటవానిపల్లె రహదారిలోని చప్టాకు అధికారులు బుధవారం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చప్టా భారీగా దెబ్బతిన్న విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి గ్రామస్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

వీడ్కోలయ్యా.. బొజ్జ గణపయ్యా



తర్లుపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గణనాథుడి ఊరేగింపు



రామాపురంలో ఊరేగింపులో చిందేస్తున్న భక్తులు

బేస్తవారిపేట: వినాయక చవితి సందర్భంగా మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలకు బుధవారం 5వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వేలంలో లడ్డూ దక్కించుకున్నవారిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మండలంలోని పూసలపాడు, చింతలపాలెం, రాణిపేట, బీసీ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను బుధవారం భక్తుల కోలాహలం మధ్య కంభం చెరువులో నిమజ్జనం చేశారు. ముందుగా డప్పులు, డీజే చప్పుళ్లకు అనుగుణంగా యువత చిందేస్తూ, బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. పోగుళ్ల గ్రామంలో గణేష్ విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను బుధవారం వేలం వేయగా దొర తిరుపతయ్య రూ.60 వేలకు దక్కించుకున్నారు.

రాచర్ల: మండలంలోని అనుమలవీడు, అచ్చంపేట, రాచర్ల, అక్కపల్లె, అనుములపల్లె, గౌతవరం, చోళ్లవీడు, గంగంపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం ఐదో రోజు నిమజ్జనానికి తరలించారు. ముందుగా పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం విగ్రహాలను అక్కపల్లె గ్రామ సమీపంలో గుండ్లకమ్మలో నిమజ్జనం చేశారు. అనుమలవీడులో లడ్డూ వేలం వేయగా గ్రామానికి చెందిన శనిగ వీరయ్య రూ.36,500కు దక్కించుకున్నారు. ఐదు రోజుల పాటు చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. బందోబస్తును ఎస్సై పి.కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

రూ.40 వేలు పలికిన గణేశ్ లడ్డూ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కమలా హ్యాపీ హోమ్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ గణపతి మహోత్సవం మండపం వద్ద బుధవారం లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను బుశెట్టి నారాయణ దంపతులు రూ.40 వేలకు దక్కించుకున్నారని నిర్వాహకులు పెనుగొండ కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పిచ్చిరెడ్డి, కమిటీ సభ్యులు



మాగుటూరులో కోలాహలం

రావూరి సుబ్బారావు, గెల్లి సుబ్రమణ్యం, కె.శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక గణేశ్‌నగర్, నల్లబండ బజారు, నరసింహస్వామి మెట్ల రోడ్డు, నంద్యాల రోడ్డులోని కారుస్టాండ్ తదితర వీధుల్లో వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. కె.ఎస్.పల్లె గ్రామ సమీపంలో గల సగిలేరు, కొండపేట ఆంజనేయస్వామి వద్ద గల సగిలేరు, కంచిపల్లె చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంబవరంలో లడ్డూను వేలం వేయగా బొడ్రాయి యూత్ రూ.83500కు, జువ్విళ్లబావి వద్ద లడ్డూను పలుకూరి ఆదినారాయణ రూ.71 వేలకు, పాత సత్యనారాయణ థియేటర్ వద్ద తిరుమల రెస్టారెంట్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను గోగుల శివకృష్ణ రూ.70 వేలకు దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పొదిలి రూరల్: మండలంలోని రామాపురం, పోతవరం, కంభాలపాడు తదితర గ్రామాల్లో గణనాథుడి విగ్రహాలకు బుధవారం వీడ్కోలు పలికారు. గణేశ్ శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని నాయుడుపేట హరిజన కాలనీలో అంబేద్కర్ యూత్ ఫోర్స్ ఈశా కేశవ ఆధ్వర్యంలో చినరాయుడు, వెలుగొండరాయుడు, మాచర్ల, చెన్నకేశవులు, కరేటి నాగరాజు పర్యవేక్షణలో యువకులు, మహిళలు ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.



లడ్డూ అందజేస్తున్న కేశవరావు, కమిటీ సభ్యులు



కంభం చెరువులో నిమజ్జనానికి హాజరైన భక్తులు



పోగుళ్లలో లడ్డూ దక్కించుకున్న తిరుమలయ్య

తర్లుపాడు: తర్లుపాడులో గణేష్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. విగ్రహ దాత కొలగట్ల అచ్చిరెడ్డిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహాన్ని సంఘ అధ్యక్షుడు జగన్‌బాబు ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి నిజ్జనానికి తరలించారు.



పాత సత్యనారాయణ థియేటర్ వద్ద లడ్డూ వేలంలో నిర్వాహకులు



అనుమలవీడులో నిమజ్జనానికి తరలుతున్న గణేశ్ విగ్రహం



నాయుడుపేట హరిజన కాలనీలో..

అటవీశాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: అటవీశాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివని గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు పేర్కొన్నారు. జాతీయ అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ సంపదను రక్షించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులను ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. అడవులను సంరక్షించడంలో అటవీశాఖ ఉద్యోగులు సంసిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్లు కుమార్‌రాజ, జీవన్‌కుమార్, మధుప్రియ, డిప్యూటీ రేంజర్లు రంగారెడ్డి, వంశీకృష్ణ, రాజశేఖర్‌గౌడ్, బాలాజీనాయక్, ఎఫ్‌ఎస్‌ఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రామానాయుడు, రామయ్య, ఎఫ్‌బీఓలు అంకన్న, ఉమాదేవి, చాంద్‌బాషా, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కార్యాలయంలో గిద్దలూరు, బేస్తవారిపేట, గుండ్లకమ్మ, తురిమెళ్ల రేంజ్ ఆఫీసర్లతో ప్రొటెక్షన్ సమావేశం నిర్వహించారు. అడవుల సంరక్షణపై కార్యాచరణ, ఇతర అంశాలపై చర్చించారు.

అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీజే నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, పరిసర శివారు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవాలని కోరుతూ ఎంపీజే నాయకులు బుధవారం పలువురు అధికారులకు వినతిపత్రం అందజేశారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో యువతే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టాలని సెబ్ అధికారులకు ఎంపీజే పట్టణ అధ్యక్షులు షేక్ నాగూర్‌మీరావలి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేసే మద్యాన్ని నిషేధించాలని కోరారు. పట్టణ పరిధిలో మురుగు కాల్వలు, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీజే నాయకులు సయ్యద్ మస్తాన్‌వలి, షేక్ అబ్బాస్, షేక్ మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి



తర్లుపాడులో కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్



బత్తాయి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఓబులాపురం, సంజీవరాయుడుపేట, కొమ్ముసూరు తదితర గ్రామాల్లో బుధవారం రైతులకు ఈ క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందాలంటే ఈ క్రాప్ వివరాలే ప్రామాణికమని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలో ఈ–పంట నమోదును ఈ నెల15వ తేదీలోగా పూర్తిచేయాలని మార్కాపురం ఇన్‌చార్జి ఏడీఏ బాలాజీ నాయక్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు, కారుమానిపల్లి ఈ పంట నమోదును పరిశీలించి కంది సాగు చేసిన రైతులకు సూచనలిచ్చారు. ఏఓ టి.వెంకటేశ్వర్లు, సీతానాగులవరం, తర్లుపాడు వీఏఏలు పూర్ణశంకర్, గోవిందు బాషా, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం: పండ్ల తోటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించాలని ఏపీఎంఐపి పీడీ పీవీ రమణ సూచించారు. బుధవారం ఆయన తిప్పాయపాలెం, పెద్దయాచవరం, ఇడుపూరు గ్రామాల్లో ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. బత్తాయి తోటల్లో జింకు ధాతు లోపం నివారణకు సూచనలిచ్చారు. డ్రిప్ ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఓబయ్య, వీహెచ్‌ఏ శివశంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: మండలంలోని ఆకవీడు, అరవీటి కోట, చినగానిపల్లె, చోళ్లవీడు, జేపీ చెరువు గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ఏఓ షేక్ అబ్దుల్ రఫీక్ పర్యవేక్షించారు. అనంతరం కొర్ర, పత్తి, ఆముదం పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.సంపత్‌కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలి



మార్కాపురంలో మాట్లాడుతున్న డాక్టర్ కనకదుర్గ



గిద్దలూరు రూరల్: గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ మహమ్మద్‌షరీఫ్



బేస్తవారిపేట: ప్రదర్శనకు ఉంచిన ఆహార పదార్థాలు

మార్కాపురం టౌన్: తల్లులు, గర్భిణులు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలని డాక్టర్ కనకదుర్గ సూచించారు. పట్టణంలోని తాడివీధి, చిన్నమసీదు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. పోషకాహార పదార్థాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుశీలాదేవి, సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

గిద్దలూరు రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్ వైద్యుడు మహమ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నంద్యాల రోడ్డులోని అర్బన్ హెల్త్ క్లినిక్‌లో బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: గర్భిణులు బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.గాలెమ్మ సూచించారు. బుధవారం అక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



హెచ్‌ఎం గురుస్వామిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

కొమరోలు: జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గురుస్వామి, ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న తెలుగు టీచర్ సుజాతను పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దుతూ మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అల్లినగరం గ్రామ సర్పంచ్ బంగారు రత్నాలు, ఎంపీటీసీ సభ్యులు కామూరి శ్రీనివాసులరెడ్డి, రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణపై వివాదం

● చినమనగుండంలో ఉద్రిక్తత

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో గురువారం నిర్వహించనున్న ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి బుధవారం రాత్రి గ్రామస్తులు సచివాలయం వద్ద సమావేశమయ్యారు. ఈ క్రమంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ నేతల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల నడుమ స్వల్ప తోపులాట జరిగింది. స్థానికులు అందించిన సమాచారంతో ఎస్సై మాధవరావు తన సిబ్బందితో కలిసి హుటాహుటిన గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులకు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మార్కాపురం: పత్తి సాగు చేసిన రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మార్కాపురం వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ డి.బాలాజీ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన నికరంపల్లి గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. పత్తిలో రసంపీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమల నివారణకు ఇమిడాక్లోప్రిడ్, నీరు 1:4 నిష్పత్తిలో మొక్క లేత కాండానికి బ్రష్‌తో పూయాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 300 గ్రాముల ఎసిఫేట్ లేదా 80 గ్రాముల థయామేథోక్జామ్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. పత్తిలో అక్కడక్కడా జింకు ధాతు లోపం ఉందని దీనివల్ల ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి మధ్యలో పసుపు రంగుకు మారిందన్నారు. దీని నివారణకు 100 గ్రాముల జింకు సల్ఫేట్ 12 శాతం ద్రావణాన్ని 7 నుంచి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, వీఏఏ జక్కి గణేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో హుండీ మాయం

పొదిలి రూరల్: పొదిలి మండలం నందిపాలెం ఎస్సీ కాలనీలోని బ్రదర్ క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో హుండీ మాయమైంది. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు తెలిపారు. హుండీలో సుమారు రూ.7 లక్షల కానుకలు ఉన్నాయని చెప్పారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వేమన బుధవారం పరిశీలించి విచారణ చేపట్టారు.

పెద్దదోర్నాలలో కలెక్టర్ విస్తృత పర్యటన

పెద్దదోర్నాల: మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత మండల పరిధిలోని రామచంద్రకోట గ్రామాన్ని ఆమె సందర్శించి జామ పంటను సాగు చేస్తున్న అంబటి తిరుపతిరెడ్డికి సంబంధించిన పొలాన్ని పరిశీలించారు. జామ పంటతో ఎకరాకు ఎంత ఖర్చు అవుతుంది, సంవత్సరానికి ఎంత ఆదాయం ఉంటుంది తదితర వివరాలను కలెక్టర్ రైతును అడిగి తెలుసుకున్నారు. జామ పంట సాగుకు సంబంధించిన ప్లాంటేషన్‌కు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుకు 3 సంవత్సరాలకు 4.57 లక్షల రూపాలయలు వంద శాతం సబ్సిడీతో మంజూరు చేశామని, మొదటి సంవత్సరం 2.34 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఏపీడీ నిర్మల కలెక్టర్‌కు వివరించారు. మార్కాపురం డివిజన్ పరిధిలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా జాతీయ ఉపాధి హామీ పథకం పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ ఏపీడీని ఆదేశించారు. అనంతరం ఇటీవల భారీ వర్షాల కారణంగా చిన్నదోర్నాల గ్రామం వద్ద దెబ్బతిన్న తీగలేరు వాగు చప్టాను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నదోర్నాల గ్రామం వద్ద ఎండిపోయిన బోరు బావికి వాటర్ రీచార్జి నిర్మాణానికి చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. పడిన వర్షం నీటిని బోరు బావులకు రీచార్జి అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.